సీరియల్

అడుగు ముందుకు వేస్తే భస్మావ్!

వసుంధర

(ఆరవ భాగము)

"మా మిత్రుడు పంపిన మంచి కానుక మీరు. మీకు ఘనంగా సత్కారం చేస్తాము. పారిపోయే ప్రయత్నం మాత్రం చేయకూడదు..." అన్నాడా ఆటవికుడు.

ఇద్దర్నీ ఒక గుడిసెలోకి తరలించారు. గుడిసెలో వీరికి సపర్యలు చేయడానికి ఇద్దరు ఆటవిక పడుచులు నియమించబడ్డారు. గుడిసె చుట్టూ పదిమంది బలాఢ్యులైన ఆటవిక యువకులు కాపలా వున్నారు.

గుడిసెలోని ఆటవిక యువతులు స్నేహపాత్రంగా వున్నారు. రామేశం వాళ్లని చాలా ప్రశ్నలడిగి తెలుసుకున్నాడు.

"మా సపర్యలను మగవాళ్లనుకాక ఆడవాళ్లను పెట్టారేం?"

"అది అతిథులను మేము గౌరవించే పద్ధతి..."

"మేము మీకు అతిథులమా? '

"మా జాతికి చెందనివాళ్ళు మా గుడిసెల్లో ప్రాణాలతో ఉన్నంత కాలమూ అతిథులక్రిందే లెక్క!"

"మా గుడిసె చుట్టూ పటిష్టమైన కాపలా ఎందుకు?"

"మీరు పారిపోకుండా?"

"అయినా పారిపోతే..."

"అసాధ్యం. ఇక్కడినుంచి బయటపడ్డం మావాళ్ళకు తప్ప ఎవరికీ సాధ్యంకాదు. ఇంతవరకూ మా అతిథులెవ్వరూ పారిపోలేదు..."

"మేమిక్కడ ఎన్నాళ్ళుంటాం?"

"ఈ రోజుతో కలిపి మూడు రోజులు..."

"ఆ తర్వాత మమ్మల్నేం చేస్తారు?"

"అది ఈవేళ చెప్పకూడదు. ఎల్లుండి చెబుతాము..."

"ఎందుకని?"

"మీకు దిగులు కలిగించే మాటలు ఇప్పట్నించీ చెప్పకూడదు..."

రామేశం ఉలిక్కిపడ్డాడు. అంటే ఆమె అభిప్రాయం ఏమిటి?

"దిగులు పడవలసిందేదో జరుగుతుందని తెలిసిందిగదా. అప్పుడే నాలో దిగులు బయల్దేరింది. ఎలాగూ దిగులుగా వున్నాను కాబట్టి ఫరవాలేదు. ఎల్లుండి తర్వాత మమ్మల్నేం చేస్తారు? ఏ దేవతకైనా బలి ఇస్తారా?" అనడిగాడు రామేశం.

"ఈ విషయంలో నన్నేమీ అడగొద్దు. నేనేమీ చెప్పను..." అందా ఆటవిక యువతి. "మీరు

అనవసరపుటాలోచనలు మాని సరదాగా కాలం గడ పండి..."

"సరదాగా అంటే..."

ఆమె నవ్వింది. "మీకు తెలియదా?"

"నేను ముసలివాణ్ణి. నా సరదాలు వేరు. నీ సరదాలు వేరు..."

"ముసలివాడికి పడుచుతనం తెప్పించకపోతే నా ఆతిథ్యం వృధా..." అందామె.

ఆమె మాటలు నిజమేనని మిగతా రెండు రోజులూ ఋజువుచేశాయి. హటాత్తుగా రామేశం వయస్సు బాగా తగ్గిపోయినట్లనిపించింది. వయసు తగ్గడమేకాక అయ నకు జీవితంమీద మోజుకూడా పుట్టసాగింది. టాకూర్‌తో ఆ విషయమే అంటే "మనమిప్పుడు చచ్చిపోయినా ఫరవాలేదు. ఎవరైనా చచ్చాక స్వర్గం చూస్తారు. మనం బ్రతికుండగానే స్వర్గాన్ని చూస్తున్నాం" అన్నాడు.

ఇద్దరికీ బ్రతుకుమీద పెద్దగా ఆశలేదు. కానీ తమకు భవిష్యత్తులో ఏమి రాసిపెట్టివుందో తెలుసుకోవాలని ఇద్దరికీ ఆత్రుతగా వుంది. తమకేదో అనుభవం జరుగనున్న దని ఇద్దరూ ఊహిస్తున్నారు. అదేమిటో తెలియక మన సులో కలవరం కలుగుతోంది.

రెండు రోజులు గడిచినాక రామేశంతో గడుపు తున్న ఆటవిక యువతి "ఇది మన ఆఖరు రాత్రి" అంది.

"ఇప్పుడు చెప్పు-రేపు నేనేమవుతాను?" అన్నాడు రామేశం.

"అప్పుడే చెప్పను. రాత్రి చెబుతాను..." అంది ఆటవిక యువతి.

అయితే ఆమె ఇతర విశేషాలు చాలా చెప్పింది రామే శానికి. అతిథులకు గూడెంలోని ఆడపిల్లలనప్పగించడం

ఆ జాతి ఆచారం. అయితే దానికీ ఒక పద్ధతి వుంది. గూడెంలోని ఇళ్ళన్నిటికీ నంబర్లుంటాయి. నంబరువారీగా ఒకరి తర్వాత ఒకరుగా అతిధ్యానికి ఉపయోగపడాలి. సాధారణంగా పెళ్ళికాని పిల్లలే అతిథులకు అప్పగించ బడతారు. ఇంట్లో పెళ్ళికాని పిల్లలు లేనప్పుడు మాత్రం పెళ్ళయినవాళ్ళనుకూడా పంపుతారు.

ఒక్క అతిధుల విషయం మినహాయిస్తే అక్కడి స్త్రీలు నియమబద్ధమైన జీవితం గడుపుతున్నట్లే లెక్క. రామేశంతో గడుపుతున్న యువతికింకా పెళ్ళికాలేదు కానీ అనుభవముంది. రెండు సంవత్సరాలక్రితం ఆమె అతిథి మర్యాదకు వినియోగించబడింది. అదే ఆమెకు ప్రథమానుభవం. ప్రథమానుభవానికి ముందు ఆమె కుల గురువు వద్ద కొంత శిక్షణ పొందుతుంది. అది సెక్సుకు సంబంధించిన శిక్షణ.

"రెండు సంవత్సరాలలోనే నువ్వు మళ్ళీ అతిథి మర్యాదకు వినియోగించబడ్డావంటే అతిధులు చాలా తరచుగా వస్తూంటారని అనుకోవాలి" అన్నాడు రామేశం.

"అదేంకాదు. అతిథి మర్యాదకు ముప్పై ఏళ్ళలోపు వారిని నియోగించరు..." అంది.

"అతిథి మర్యాద విషయంలో మీవాళ్ళు నాకు చాలా నచ్చారు. కుల గురువు మీకు శృంగార శిక్షణ ఇస్తా డన్నావు—మరి కులగురువు కూతురి కెవరిస్తారు?" అన్నాడు రామేశం.

ఆటవిక యువతి ఆ ప్రశ్నకు విరగబడి నవ్వింది—"భలే సందేహాలొస్తూంటాయి మీ నాగరకులకి. కుల గురువు కూతురి విషయం నాయకుడు చూసుకుంటాడు."

"నీ తండ్రి నాయకుడయ్యే అవకాశ ముండదా?"

"ఎందుకు?"

"నువ్వు నన్ను రక్షిస్తావని!"

"అలా రక్షించను. ప్రాణం పోయినా మా పద్ధతులు విడనాడం. నా తండ్రి నాయకుడు కాకపోయినా నాయకుడికి కుడి భుజం. ఆయనకు చాలా రహస్యాలు తెలుసు. వాటిలో కొన్ని నాకూ చెబుతూంటాడు..." అంది ఆటవిక యువతి.

"రహస్యాలంటే ఎలాంటివి?"

"ఊహుఁ నేను చెప్పను."

ఆ రాత్రి రామేశం ఆమెకు మళ్ళీ గుర్తు చేసాడు తన ప్రశ్న విషయం.

"చెబుతున్నాను విను...కానీ కంగారు పడకు..." అందామె—"నీకు మృత్యులోయ తెలుసా!"

"తెలియదు. అదెక్కడుంది?" రామేశం కంగారుగా అడిగాడు.

"అయితే రేపు తెలుసుంది..." అందామె.

"వివరంగా చెప్పూ..." అన్నాడు రామేశం.

"మిమ్మల్ని మీ స్నేహితుణ్ని రేపు మృత్యులోయకు పంపిస్తారు..."

"మృత్యులోయ ఎక్కడుంది?"

"గూడేనికి దగ్గరలోనే వుంది... అందులోకి వెళ్ళినవారు మరి బ్రతికి రాలేరు..."

"ఎందుచేత?" అన్నాడు రామేశం.

"లోయంటే మరీ పెద్దదికాదు. నుయ్యికంటె కాస్త పెద్దదిగా వుంటుంది కానీ చాలాలోతువుంటుంది. గోడలు నున్నగా వుంటాయి. అందులో పడ్డవాడు మళ్ళీ పైకి రావడం కష్టం. మూడు రోజులకు సరిపడ్డ ఆహారమిచ్చి మిమ్మల్నందులోకి దింపుతారు. ఆ తర్వాత మీ సంగతి

ఎవరూ పట్టించుకోరు. తిండి వున్నప్పటికీ బ్రతకలేనంత అసహ్యంగా అక్కడ వుంటుందని చెప్పుకుంటారు...” అందామె.

రామేశం గుండెలు గుబగుబలాడాయి—“ఎందుకు మమ్మల్ని ఆ లోయలోకి దింపాలనుకుంటున్నారు?”

“మేము పూజించే దేవతకు రక్తపాతం గిట్టదు. సహజంగా మరణించిన వాళ్ళనే ఆవిడ స్వీకరిస్తుంది. అందుకే ఈ మృత్యులోయను ఎప్పుడో కొన్ని వందల సంవత్సరాల క్రితం మా పూర్వీకులు సృష్టించారట. ఈ విధంగా ఏటా ఓ పదిమంది మనుష్ులైనా సమర్పించ గలిగితే మా గూడెం సుఖంగా వుంటుంది.”

తన జీవితానికి అంతం సమీపించిందని రామేశం గ్రహించాడు. అదీ సుఖమైన అంతంకాదు. అంతవరకూ పోయిన ముగ్గురూ అదృష్టవంతులు. క్షణాలమీద ప్రాణాలు పోయాయి. ఇప్పుడు తనూ, టాకూర్ దుర్గంధ పూరితమైన వాతావరణంలో తిండి తిప్పలు లేక అలమటించి పోవాలి. అలా అలమటిస్తూ ప్రాణాలు కోల్పోవాలి. అత్యంత భయంకరమైన చావు అది!

“మేము ఒక అపూర్వ నిధి ప్రాంతంనుంచి ఇక్కడకు పంపబడ్డాము. అక్కడున్న వాళ్ళు నాగరికులు. వాళ్ళకు మీకూ ఏమిటి సంబంధం?” అనడిగాడు రామేశం.

“వాళ్ళ నిధికి మేము రక్షకులం. మా ద్వారా ఆ నిధిని చేరితే ఏ ఆపదా వుండదు.”

రామేశం ఆశ్చర్యపడ్డాడు—“మీరా నిధికి రక్షకులా? నాగరికుల కుపయోగపడుతున్న ఆ ప్రాంతానికి మీరెప్పుడు ఎలా రక్షకులయ్యారు?”

“ఒకరోజులో పోతున్న నీకీ రహస్యాలు కాస్త చెప్పడంలో నాకు కష్టంలేదు. ఇది చాలా తక్కువ మందికి

తెలిసిన విషయం. ఇక్కణ్నించి బయల్దేరి నాగరక ప్రాంతం చేరితే మొట్టమొదట వచ్చేది గంగాపురం గ్రామం. ఆ గ్రామానికి పదిమంది పెద్దలున్నారు. వారిలో కొందరు ముఖ్యులకూ మా జాతికీ కొన్ని ఒప్పందాలు న్నాయి. వారు మా దగ్గరకు పంపిన సందేశాన్నిబట్టి మేము నడుచుకుంటాము. నిధిలో పనిచేయడానికి కొత్త మనుషులు అవసరమైనప్పుడు గంగాపురం గ్రామపెద్దలు ఆ మనుషుల్ని మా దగ్గరకు పంపుతారు. మేము వారిని క్షేమంగా నిధివద్దకు చేరుస్తాము. అలా కాకుండా తమంతట తాముగా ఆ నిధిని చేరబోయిన వారికి మీకు పట్టిన గతే పడుతుంది...'' అందా ఆటవిక యువతి.

రామేశానికి కథ చాలావరకూ అర్థమయ్యింది. ఎటొచ్చీ అర్థం చేసుకుని ప్రయోజనంలేదు. తమ జీవితాలకు అంత్యకాలం సమీపించింది.

ఏది ఏమైతేనేం__రామేశం భయపడుతున్న ఆ క్షణం రానే వచ్చింది. ఆయన టాకూర్‌కు తమ పరిస్థితి అంతా వివరించి చెప్పాడు. టాకూర్ ఆటవిక యువతితో ఆనందాన్ననుభవించాడు కానీ అతడికి ఆమె భాష రాదు.

రామేశం చెప్పిందంతా విని__"పిరికి వాడికి పదిరకాల చావులు కానీ ధైర్యవంతుడి దొక్కటేచావు. చావు గురించి ఆలోచించవద్దు. ఏం జరిగినా అనుభవించక తప్పదు. అదృష్టం ఇన్నాళ్ళు బ్రతికించింది. ఇక ముందేం చేస్తుందో చూద్దాం__'' అన్నాడు టాకూర్.

పెద్ద ఆర్భాటమేదీ లేకుండానే రామేశాన్ని, టాకూర్‌నూ మృత్యులోయవద్దకు తరలించారు. రామేశం ఆ ప్రాంతాన్ని పరిశీలించాడు. అదో పెద్ద గొయ్యిలావున్నది కానీ అడుగు కనిపించడంలేదు.

ఆ పక్కగా ఒక పెద్ద బుట్ట. ఆ బుట్టలో ఆహార పదా

రాలు, ఇద్దరు మనుషులు కూర్చోవడానికి చోటు. పైన ఒక కొక్కెం. ఆ బుట్ట పక్కగా పొడవైన తాడుచుట్ట పడివుంది. మృత్యులోయకు అడ్డంగా పడివున్న కర్ర మీదుగా ఆ త్రాటికి బుట్టను కట్టి తమను మృత్యులోయ లోకి దింపుతారని రామేశమూ, టాకూరూ ఊహించారు.

వాళ్ళతోపాటు అక్కడ ఆటవిక నాయకుడూ, కుల గురువూ, అతిథులిద్దరికీ ఆనందాన్నిచ్చిన ఆటవిక యువ తులూ మాత్రం వున్నారు.

కుల గురువు ఏవో మంత్రాలుచ్చరిస్తున్నాడు. అది సంస్కృతంకాదు. బహుశా ఏదో ఆటవిక భాష అయ్యుం టుంది.

కాస్సేపయ్యాక అక్కడకు చాలామంది వచ్చారు.

ఆటవిక నాయకుడు చప్పట్లు కొట్టాడు. వెంటనే కొంతమంది యువకులూ, యువతులూ పరుగు పరుగున వచ్చి రామేశాన్నీ, టాకూర్‌నూ చుట్టుముట్టారు. కొంత సేపు ఆటవిక నృత్య ప్రదర్శన జరిగింది. అంతా ఆనం దంతో చప్పట్లు కొడుతున్నారు కానీ రామేశం, టాకూర్ క్షణాలు లెక్కపెట్టు కుంటున్నారు. వాళ్ళ ముఖాల్లో కత్తివాటుకు నెత్తురు చుక్కలేదు.

నృత్య ప్రదర్శన అయ్యేక ఆటవిక నాయకుడు రామే శాన్నీ, టాకూర్‌నూ బుట్ట దగ్గరకు నడిపించుకు వెళ్ళి— అందులో నిలబడమన్నాడు. ఇద్దరూ ఒక పర్యాయం చుట్టూ చూశారు. ఆయుధాలు ధరించి పదిమంది బలా ఢ్యులు తమకు చుట్టూ అర్ధ చంద్రాకారంలో వున్నారు. తమ జీవితానికది చరమకాలమేనని ఇద్దరూ అనుకున్నారు.

"ఇప్పుడు మీకు మత్తు కలిగించే పానీయాన్నిస్తాము. అది సేవించాలి. అందుకు ముందు ఆఖరిసారిగా అన్ని మత్తులకూ మించిన ఆడదాని ముద్దు కూడా రుచిచూడ

వచ్చు. ఇదీ మా ఆచారం'' అన్నాడు ఆటవిక నాయకుడు.

అంతా కాస్త దూరంగా వెళ్ళారు. ఆటవిక యువతులిద్దరూ రామేశాన్నీ, టాగూర్‌నూ సమీపించారు. జీవితంలో మళ్ళీ ఇటువంటి అవకాశం రాదని గ్రహించి, అంతటి నిరుత్సాహ పరిస్థితుల్లోనూ వారిద్దరూ ఆ యువతుల్ని గాఢంగా చుంబించారు.

''నువ్వు చాలా అదృష్టవంతుడివి...'' అందా ఆటవిక యువతి రామేశంతో ''ఈ రోజు అపూర్వమైన దినం.''

''ప్రాణాలు పోతున్న నాకింకా అదృష్టమేమిటి?'' అన్నాడు రామేశం.

''అదృష్టమేమరి! మృత్యులోకంనుంచి బయట ప్రపంచానికొక ద్వారం వుంది. అది బండరాతితో మూయబడి వుంటుంది. ఎంతటి బలాఢ్యులూ దానిని కదిలించలేరు. ఆ రాతిని కదిలించడానికి మా గూడెంలోంచి ఏర్పాటుంది. సంవత్సరానికొకసారి ఆ రాతిని కదిలిస్తారు. మృత్యులోయలో చనిపోయిన మనుషుల ఆత్మలు మళ్ళీ మా గూడేనికి వచ్చి పీడించకుండా బయటి ప్రపంచంలోకి పోవడంకోసం ఈ ఏర్పాటు చేశారు.''

''చాలా బాగుంది. ఏడాదికొకసారి తప్పితే ఆత్మలు కదల్లేవా?''

''అదే మా విశ్వాసం. చచ్చిన రెండేళ్ళ వరకూ ఆత్మ చలనం లేకుండా పడివుంటుంది. ఆ తర్వాత అది కదలడానికి ప్రయత్నించి దరిదాపుల్లో ఏ మార్గముంటే దానిద్వారా బయటకు పోవడానికి ప్రయత్నిస్తుంది. ఆ ప్రకారం ఈ రోజు రాత్రి ఆ ద్వారాన్ని తెరవబోతున్నారు. ఈ విషయం నాకిప్పుడే తెలిసింది, ఇంతవరకూ

ద్వారం తెరిచే రోజునే మనుషులను మృత్యు లోయలోకి దింపడం ఇదే ప్రథమం—బహుశా ఇది మీ అదృష్టమనుకుంటాను...” అందామె.

రామేశం కళ్ళు మెరిసాయి. అంతలోనే ఆయనకో అనుమానం వచ్చింది. “ఈ విషయం నాయకుడికి గుర్తు లేదేమో! ఆ ద్వారాన్ని తెరవడమో, మమ్మల్ని లోయలోకి పంపడమో వాయిదా వేస్తాడనుకుంటాను...”

“అలా ఎన్నటికీ జరుగదు. మా గూడేనికి వచ్చిన నాగరీకుల్ని మూడు రోజులకుమించి ఉంచుకోము. అలాగే మృత్యులోయ ద్వారం తెరుచుకోవడం విషయంలోకూడా కచ్చితమైన నియమం పాటిస్తాము. ఈ రోజే మృత్యులోయ ద్వారం తెరిచే రోజని నాకు గుర్తు లేదు. గుర్తురాగానే మీరు నిజంగా చాలా అదృష్టవంతు లనిపించింది. అందుకే ఈ విషయం చెబుతున్నాను...” అందామె.

ఆ యువతులిద్దరూ అక్కణ్ణించి కదిలారు. రామేశం టాకూర్‌కు కొత్త విషయం చెప్పాడు. టాకూర్ ముఖంలోకూడా ఆనందం కనబడింది.

ఈలోగా ఆటవిక నాయకుడు వారిద్దర్నీ సమీపించాడు. ఇద్దరికీ మత్తు పానీయాలందించబడ్డాయి. అవి సేవించి ఇద్దరూ బుట్టలో కూలబడిపోయారు. మళ్ళీ వాళ్ళిద్దరికి మెలకువ వచ్చేసరికి మృత్యు లోయలో వున్నారు. ఇద్దరూ పరస్పరం భుజాలు తట్టుకుని లేచి నిలబడ్డారు.

అక్కడ మరీ అంత చీకటిగా లేదు. ఎక్కణ్ణించి వస్తోందో ఎలా వస్తోందో కానీ సాయంకాలపు ఎండలా వుంది. ఆ ప్రాంతమంతా దుర్గంధం. భరించలేనంత వాసన. ఇద్దరూ ముక్కులు మూసుకున్నారు కానీ ఎంత

సేపని అలా వుండగలరు? క్రమంగా అలవాటు పడక తప్పలేదు.

"ఈ దుర్వాసన ఎంతోసేపు భరించలేము. ఇందులో ఎంతోసేపు బ్రతకలేము" అన్నాడు టాగూర్. ఆ వాసన వల్ల కలిగిన అసహ్యాం అతడి కళ్ళలో ప్రతిఫలిస్తోంది.

"ఈ బుట్టను వాళ్లు కట్టిన తాడు వుండాలిగదా! దాని సాయంతో మళ్ళీ పైకి వెళ్ళగలమేమో చూద్దాం..." అన్నాడు రామేశం.

అయితే ఇద్దరూ ఎంత చూసినా తాడుకాదు సరిగదా బుట్టను తగిలించిన కొక్కెంగూడా లేదు. ఇద్దరూ ఉస్సూరంటూ నిట్టూర్చారు.

"బహుశా అన్ని బుట్టలతూ ఆ తాడును, కొక్కేన్నీ వాడుతూంటారేమో! బుట్ట నేలను తగలగానే విదిలించి మళ్ళీ పైకి లాగేసుకోవడం వాళ్ళకు తెలిసివుంటుంది" అన్నాడు టాగూర్. అంతే అయుండాలని రామేశం కూడా అనుకున్నాడు.

ఇద్దరూ కాసేపు మృత్యులోయను సర్వే చేశారు.

మృత్యు లోయ అని పిలవబడే ఆ ప్రదేశం ఓ రెండు వాలీబాల్ కోర్టులంత ఆవరణలో వుంది. గుండ్రంగా నుయ్యిలా వుంది. ఎంతో లోతుగా వున్నప్పటికీ నేల చెమ్మగా లేదు. బాగా పరీక్షించగా అదంతా రాతితో తాపడం చేసినట్లు వారికి తోచింది. దానినిబట్టి ఈ లోయను ప్రత్యేకంగా నిర్మించినట్టు వారిద్దరూ భావించారు.

మృత్యులోయ చుట్టూకూడా పటిష్టమైన శిలలున్నాయి. బయటకు పోవడానికి ఎక్కడా సూదిమొన మోసేటంత సందుకూడా లేదు. అయితే వెలుతురు ఎక్కణ్నించి వస్తోందో ఎలా వస్తోందో తెలుసుకోవడం కష్టం.

మృత్యు లోయనిండా మానవ కపాలాలు, అస్థిపంజ
రాలు, ఎముకలు గుట్టలు గుట్టలుగా ఉన్నాయి. ఎన్నో
సంవత్సరాలుగా అక్కడ జరుగుతున్న ఘోర మరణాల
కవి ఉదాహరణాలుగా కనబడుతున్నాయి. అప్పు
డప్పుడే కుళ్ళి కృశించిపోతున్న మూడు శవాలనుకూడా
వాళ్ళు చూశారు.

ఆ శవాల ముఖాలు చూస్తామన్నా గుర్తు తెలియ
కుండా మహా భయంకరంగా వున్నాయి. వాటిలో
ఒకటి స్త్రీశవం! ఆ శవాన్ని చూస్తూనే ఇద్దరూ ఉలిక్కి
పడ్డారు. ఆడవాళ్ళనుకూడా నిర్దాక్షిణ్యంగా ఈ మృత్యు
లోయకు బలిచేస్తున్న ఈ ఆటవిక జాతి గురించి ఏమను
కోవాలి?

టాగూర్ ఆలోచనలు వేరే వున్నాయి. "మనిషి
బాహ్యరూపం ఇంత భయంకరంగాకూడా ఉంటుందని
ఇప్పుడే తెలిసింది. అదృష్టం కరుణించకపోతే మనం
కూడా కొన్నాళ్ళకిలాగే తయారౌతాము..."

రామేశం విషాదంగా నవ్వాడు. అక్కడున్న దుర్వా
సన ఆయన భరించలేకుండా వున్నాడు. ఆహారం వున్న
ప్పటికీ ఆ లోయలో ఒకరోజుకు మించి జీవించడం కష్ట
మని చెప్పిన ఆటవిక యువతి మాటల్లోని నిజం ఆయన
కప్పుడు గోచరించింది.

"నాగరకతకు మధ్యలో జీవిస్తున్న ఈ అనాగర
కతను రూపుమాపాలి. అందుకు మనం బ్రతికి బయట
పడ్డాక ఏదో ఒకటి చేయాలి..." అన్నాడు టాగూర్.

"అనాగరకత నాగరకతకు మధ్యగా ఎప్పుడూ
వుంటూ వస్తోంది. ఈ అరణ్యంలోనే కాక పట్నాలలో,
నగరాలలో కూడా వుంటోంది. మనమేమీ చేయలేము.
నా ఆలోచన అంతా ఆ అపూర్వ నిధి గురించే! దాన్ని

కనుగొన్న దుర్మార్గుల కారణంగానే మనకీ కష్టాలన్నీ వచ్చాయి. వాళ్ళ అంతు చూడాలి. ఆ నిధిని ప్రభుత్వ పరం చేయాలి..." అన్నాడు రామేశం.

టాకూర్ బదులివ్వలేదు. ఇద్దరూ ఆశగా ఎప్పుడో తెరుచుకోబోయే ఆ బండరాయి కోసం చూస్తున్నారు. అదెక్కడ వుందో, ఎప్పుడు, ఎలా తెరుచుకుంటుందో— తెరుచుకుంటే ఆ ద్వారం తమ నెక్కడకు చేరుస్తుందో తమకోసం ఇంకా ఏమేమి కష్టాలు దాగుని వున్నాయో నని వా రాలోచిస్తున్నారు. ఆలోచిస్తూనే మృత్యులోయ అంతా తిరుగుతూ ఏమేమో శోధిస్తున్నారు. అలా తిరు గుతూండగా రామేశం గట్టిగా అరిచాడు—"టాకూర్— ఇది చూడు .."

టాకూర్ పరుగున రామేశాన్ని చేరాడు. రామేశం చేతిలో ప్రకాశవంతమైన రాయి ఒకటి వుంది. అది ధగధగా మెరుస్తోంది. దాని పరిమాణం కుంకుడు గింజంత వుంది.

"ఈ పక్కన రెండు రాళ్ళ మధ్య దీన్ని చూశాను. ఇది అపూర్వమైన రాయి అనుకుంటాను. దీని ఖరీదు బహుశా కోట్లలో వుండవచ్చు..." అన్నాడు రామేశం.

అటువంటి రాళ్ళు ఇంకా దొరుకుతాయేమోనని టాకూర్ కూడా వెతికాడు. అలా వెతగ్గా ఇద్దరికీ కూడా చాలా రాళ్ళు దొరికాయి.

"వీటిని మనం కూడా తీసుకుపోదాం—" అన్నాడు టాకూర్.

రామేశం ఏదో ఆలోచిస్తూ—"వీటిని జాగ్రత్తగా మూట కడదాం. కానీ ఈ మృత్యులోయ వజ్రాల గనిగా, మణుల నిలయంగా, రత్నకోశంగా నాకు అనిపించడం లేదు. ఈ రాళ్ళిక్కడకు ఎందుకు వచ్చాయి? ఎలా

వచ్చాయి? ఇవి గనుల్లోని రాళ్ళలా కాక సానపట్టబడిన వాటిలా వున్నాయి. కాబట్టి ఎవరో వీటిని ప్రత్యేకంగా ఇక్కడ వుంచారని అనుకోవాలి. అయితే ఎందుకు? ఏం ప్రయోజనం ఆశించి?'' అన్నాడు.

హాఠాత్తుగా టాకూర్ కళ్ళలో భయం కనబడింది. ''ఇవి మనకు రాళ్ళ సందున దొరికాయి. కొన్ని దివ్య సర్పాలకు పడగమీద మణి వుంటుందని అంటారు. అటువంటి దివ్య సర్పాలేమైనా ఇక్కడ నివశిస్తున్నాయేమో!''

ఈ ఆలోచనకు రామేశంకూడా భయపడ్డాడు, అయితే అక్కడ పాములుండడానికి అవకాశం కనపడ్డంలేదు. నేలంతా రాతితో తాపడం చేసినట్లు వుంది. చుట్టూ కూడా అలాగే వుంది.—''ఒకవేళ ఆ రాతి ద్వారం తెరుచుకునేది ఈ పాములకోసం కాదు గదా! కొన్ని సర్పాలు ఏడాదికొక పర్యాయం వచ్చి తమ మణిని ధరించి మళ్ళీ తిరిగి వదిలి వెడతాయని చెప్పుకుంటారు—'' అన్నాడు రామేశం.

ఈ ఆలోచనతో ఇద్దరూ వణికిపోయారు. అదే నిజమైతే వారికింక విముక్తిలేదు. ఇద్దరికీ ఒకే క్షణంలో చావు తప్పదు.

మళ్ళీ టాకూర్ అన్నాడు. ''ఇది కేవలం మన ఊహ. పాములవల్ల చావాల్సివస్తే ఎలాగూ తప్పదు. ఊహాలతో మనను మనం చంపుకోవద్దు. ముందీ రాళ్ళను మూటగా కడదాం.''

బుట్టలో తిను బండారాలమీద వుంచిన ఒక గుడ్డతీసి ఇద్దరూ ఆ రాళ్ళను లెక్కపెట్టి మూటగా కట్టారు. మొత్తం ఇరవైమూడు రాళ్ళున్నాయి. వాళ్ళు మూట కట్టడం పూర్తి కాగానే మృత్యులోయలో ఇదివరకటి కాంతి తగ్గిపోయింది. ఇప్పుడక్కడ కనుచీకటి పడు

తున్నట్లుగా వుంది. ఈ మార్పుకు వాళ్ళిద్దరూ ఆశ్చర్య పడ్డారు.

"ఈ రాళ్ళ ప్రయోజనం అర్థమయింది..." అన్నాడు రామేశం.

టాకూర్‌కూ అర్థమయింది. మృత్యులోయకు వెలుతురు ప్రసాదిస్తున్నవా రాళ్ళేనని ఇద్దరూ గ్రహించారు. వెంటనే ఇద్దరూ మాటవిప్పారు. మళ్ళీ లోయ కాంతితో నిండింది.

"బయటపడే అవకాశంవస్తే అప్పుడు మన మీ మాటలను కూడా తీసుకుపోదాం—" అన్నాడు టాకూర్.

"అలా చేయవద్దు—" అన్నాడు రామేశం–"ఈనాడు మనం బయట పడవచ్చు కానీ ఈ మృత్యులోయకు ఇంకా ఎంతమంది బలి కావలసివుందో? ముందు ముందు ఇక్కడికి రానున్న వారికి మన కారణంగా మరిన్ని అనర్థాలు జరిగితే మనకు ఈ ఆటవికులకూ పెద్ద తేడా ఏమీ వుండదు. ఏ ప్రయోజనాన్నాశించి ఈ రాళ్ళిక్కడ వుంచబడ్డాయో ఆ ప్రయోజనానికే ఈ రాళ్ళను ఉంచేద్దాం!"

టాకూర్ మొదట అంగీకరించలేదు కానీ తర్వాత రామేశం మానవతా వాదం అతన్ని లొంగదీసింది–"గుర్తుగా ఒక్కటంటే ఒక్కటి తీసుకు వెడతాం–" అన్నాడతను ఆఖరికి.

"మనకా మణిమీద ఆశ ఎందుకు? ఇక్కణ్నించి బయటపడ్డాక బయట ప్రపంచానికి చూపుదామనే గదా! అలా చూడగల అవకాశం మనకు వస్తే మనం చేతులు ముడుచుకు కూర్చోము గదా! ఈ మృత్యులోయ అంతం చూస్తాం.

"ఇప్పుడు ఒక్క మణికూడా మనం తాకవద్దు. ఆ ఆలోచనే మనకు వద్దు. మన మీ మణులతో బయటపడి

మధ్య మార్గంలో మరణించామనుకో. మనకు మణి దక్కదు. మృత్యులోయలో అంధకారానికి దోహదం చేసిన వారి మవుతాము. ఒక్క మణికూడా తీసుకు పోకుండా వుండడం మానవాళికి ప్రస్తుతానికి మనం చేయగల ఉడతా భక్తి సాయం...'' అన్నాడు రామేశం.

“నా ఆలోచన అంతదూరం పోలేదు. మరణించే టప్పుడు కూడా మానవాళికి సాయపడాలని చూస్తున్న మీ దృష్టికి జోహార్లు. అందుకల్లనే మిమ్మల్నింతవరకూ దేవుడు కాపాడాడనుకుంటాను. మీ కారణంగా నేను కూడా ఇక్కణ్ణించి తప్పించుకునే అవకాశముండగలదన్న ఆశ ఇప్పుడిప్పుడే నాకు కలుగుతోంది'' అన్నాడు టాగూర్.

తర్వాత ఇద్దరూ ఆ రాళ్ళను అక్కడ మళ్ళీ యథాస్థానంలో పెట్టేశారు.

క్షణాలు యుగాల్లా గడుస్తున్నప్పటికీ వారి అదృష్టం బాగానే వుంది. వారా లోయలో ప్రవేశించిన చాలా సేపటికి ఒక మూలగా మృత్యులోయ గోడలో చలనం ప్రారంభమైంది. వారు చూస్తుండగా ఒక పెద్ద రాయి అడ్డంగా తిరిగి బయటకు వెళ్ళడానికి మార్గం ఏర్పడింది.

రామేశం, టాగూర్ ఆలస్యం చేయలేదు. వారు గబగబా తమ ఆహార పదార్థాల మూటలను తీసుకుని ఆ రాతికి రెండు పక్కలనుంచీ ఇద్దరూ-అక్కడ ఏర్పడిన మార్గంలో ప్రవేశించారు. ఆ మార్గం చీకటిగా వుంది.

“ఒకేఒక్క మణిని తీసుకువస్తే ఈ చీకటిలో బ్యాటరీ లైటులా ఉపయోగపడతుందేమో'' అన్నాడు టాగూర్.

“ఈ చీకటి మనకు శాశ్వతం కాదు. ఎలాగో బయట పడగలం'' అన్నాడు రామేశం.

ఇద్దరూ చీకట్లో తడుముకుంటూ ముందడుగు వేస్తు

న్నారు. ఏ క్షణంలోనైనా పాము బుసకొడుతుందేమోనని ఇద్దరూ భయపడుతున్నారు. కొంతమార్గం ప్రయాణం చేసేసరికి వారికి కొంత వెలుతురు కనబడింది.

"బహుశా మన కష్టాలు గట్టెక్కాయనుకుంటాను. భూభాగం మీదకు వెడతాము అదృష్టంకొద్దీ ఇంతవరకూ ఏ సర్పాలూ మనకు ఎదురుకాలేదు" అన్నాడు టాగూర్.

వారు ముందడుగు వేస్తున్నకొద్దీ వెలుతురు హెచ్చుకాసాగింది. ఇద్దరూ నడక వేగం హెచ్చించారు. క్రమంగా ఆ సొరంగమార్గం వారిని భూమిమీదకు చేర్చింది. ఇద్దరూ కళ్లు నులుముకుని ఆత్రుతగా చుట్టూ చూశారు.

అదీ అరణ్యమే! తాము నడచిన దూరాన్ని అంచనా వేసుకుంటే రామేశానికి అనిపించినదేమిటంటే ఆటవికుల గూడేనికి సమీపంలోనే తాముండి వుండాలి.

"ఇప్పుడేం చేయాలి?" అన్నాడు టాగూర్.

రామేశం యేదో చెప్పబోయి ఆగిపోయాడు. భయంతో ఆయనకళ్ళు ఉబికాయి.

చెట్లచాటునుంచి అయిదుగురు ఆటవికులు వచ్చి వాళ్ళిద్దర్నీ చుట్టుముట్టారు.

"మృత్యులోయనుంచి తప్పించుకువచ్చారా? మీ అంత అదృష్టవంతుల్ని మేమెక్కడా చూడలేదు" అన్నాడు వాళ్ళలో ఒకడు.

"మీకేమీ భయంలేదు. మిమ్మల్ని క్షేమంగా మీరు కోరిన ప్రాంతం చేరుస్తాం." అన్నాడింకో ఆటవికుడు.

"ఎటొచ్చీ మీ అదృష్టానికింకో పరీక్షవుంది" అన్నాడు మరో ఆటవికుడు.

"ఏమిటది?" అన్నాడు రామేశం నీరసంగా. పరీక్ష మీద పరీక్షలు జరిగాయింతవరకూ. అయిదుగురికి యిద్దరు మిగిలారు_ఎంతో మానసిక వేదననుభవించారు. ఇంక

పరీక్షలను తట్టుకునే ఓపిక కూడా లేదు.

"మిమ్మల్నిద్దర్నీ సోదా చేస్తాం. మృత్యులోయలో అపూర్వమైన మణులున్నాయి. లోయను వెల్లడించకుండా వాళ్ళు దాకొని కాపలాగా వుంటారు. అయితే అందులోంచి బయటపడ్డవాళ్ళకు వాటిమీద ఆశవుండవచ్చు. అందుకని వాటిని అపహరించాలనుకోవచ్చు. అలాంటి ఆశపోతులను మేము క్షమించము. మా దేవత వాళ్లకు నిర్ణయించినది మరణశిక్ష ఒక్కటే. మీ ఇద్దరిలో ఎవరివద్ద ఆ మణి వుంటే ఆ మనిషిగుండెల్లో అయిదు బల్లేలొక్కసారి దిగబడతాయి. అలా మణిలేని పక్షంలో మీరు కోరిన సురక్షిత ప్రాంతానికి మిమ్మల్ని చేరుస్తాం" అన్నాడు ఒక ఆటవికుడు.

ఆ మాటలు విని, అర్థం టాకూర్ కి చెప్పి రామేశం తృప్తిగా నిట్టూర్చాడు. ఇన్నాళ్ళకు ఒక మానవతావాదం తనను రక్షిస్తోందన్న మాట! "ముందు నన్ను సోదా చెయ్యండి" అంటూ ఆయన ముందుకు వెళ్ళాడు.

రామేశాన్ని వాళ్ళు సోదాచేస్తూంటే టాకూర్ గుండెలు భయంతో విలవిల్లాడిపోతున్నాయి. అప్రయత్నంగా అతడిచేతులు జేబులోకి వెళ్ళబోయాయి. ఆటవికులతన్ని శ్రద్ధగా గమనిస్తున్నారు. ఇద్దరు చటుక్కున ముందరకు వచ్చి అతడి రెండుచేతులూ బలంగా పట్టుకున్నారు.

"ప్లీజ్ నన్ను వదిలిపెట్టండి" అన్నాడు టాకూర్ హిందీలో.

రామేశాన్ని సోదాచేయడం పూర్తయింది. "నువ్వు నిజంగా అదృష్టవంతుడివి" అన్నాడు ఆయన్ను సోదా చేసిన ఆటవికుడు.

ఇద్దరు ఆటవికులు టాకూర్ ను సమీపించారు.

టాకూర్ రామేశాన్నుద్దేశించి "నా అంత్యకాలం సమీపించింది. నీ మాట చెవిన పెట్టక ఒకేఒక్క మణి నా జేబులో దాచాను. నా కొడుకు చిరునామా గుర్తుందికదా. తప్పకుండా వెళ్ళి వాడిని కలుసుకుని ఈ కథంతా చెప్పు. నా చావుకు ప్రతీకారం తీరేదాకా నా ఆత్మ శాంతించదని వాడికి చెప్పు" అన్నాడు. అతడి కళ్లలో కొట్టొచ్చినట్లు కనబడుతోంది ప్రాణభీతి.

రామేశం జాలిగా చూశాడు టాకూర్ వంక.

"ఇన్ని కష్టాలు గడిచిగట్టెక్కేక ఈ విధంగా ప్రాణాలు పోగొట్టుకుంటున్నందుకు నాకు చాలా బాధగా వుంది. ఏంచేసేది? దేవుడు నన్ను చిన్నచూపు చూశాడు" అన్నాడు టాకూర్ మళ్ళీ.

ఆటవికులతణ్ణి సోదా చేయడం ప్రారంభించారు. అతడు మణి వుంచిన జేబుతప్ప మిగతా సోదా పూర్తి అయింది. మణివుంచిన జేబులోకి ఆటవికుడి చేతులు వెడుతూంటే తన జీవితం ముగిసినట్లే భావించి కనులు మూసుకున్నాడు టాకూర్. ఉరికంబం ఎక్కిన నేరస్థుడి భావాలు అతడి మెదడులో చోటుచేసుకోసాగాయి.

"నువ్వా అదృష్టవంతుడివే!" అన్న మాట విని ఆశ్చర్యంగా కళ్ళు తెరిచాడు టాకూర్.

ఆటవిక లతడివంక ఆప్యాయంగా చూస్తూ "ఎందుకలా కంగారుపడ్డావు? నీ దగ్గర కూడా మణి లేదు. మీ ఇద్దరూ ఎక్కడికి వెళ్లాలనుకుంటున్నారో చెప్పండి. వదిలి పెడతాం" అన్నాడు.

అది కలో, వైష్ణవమాయయో అర్థంకాలేదు. తన చేతుల్తో తను జేబులో మణిని వేశాడు. తన అదృష్టంకొద్దీ జేబుకు చిల్లివుండి అదెక్కడో పడిపోయివుండాలి. ఏది ఏమైతేనేం_తన ప్రాణాలు రక్షించబడ్డాయి. అంతటి

సంతోషం టాగూర్ జీవితంలో ఎన్నడూ పొందివుండడు.

"గంగాపురం" అన్నాడు రామేశం.

ఆటవికుడి ముఖంలో కంగారు కనబడింది "గంగాపుర వాసులకు మీరు శత్రువులు. వారు మాకు మిత్రులు కాబట్టి మీరు మాకు శత్రువులు. వారి శత్రువులను మేము ప్రాణాలతో వదిలిపెట్టడం జరగదు. మీది అరుదైన అదృష్టం. మిమ్మల్ని వదిలిపెట్టడమన్నది మేము స్వతంత్రించి చేస్తున్నపని. మిమ్మల్ని మేమిలా వదిలిపెట్టినట్లు గంగాపుర వాసులకు తెలిస్తే వారికీ మాకూ గొడవలు వస్తాయి. అది మా కిష్టంలేదు. కాబట్టి ఇంకేదైనా ప్రాంతం చెప్పండి.'.

"అయితే రాజమండ్రికి దారి చెప్పండి. మేంపోతాం" అన్నాడు రామేశం.

"మా గూడేనికి దారి గంగాపురంలోని కొందరు ముఖ్యులకు తప్ప మరెవ్వరికీ తెలియదు. ఇతరులకు తెలియడం మాకూ ఇష్టంలేదు. మీరు రాజమండ్రి వెళ్ళాలను కుంటే మాకేమీ అభ్యంతరంలేదు. మిమ్మల్ని స్పృహ తప్పించి ఓ బుట్టలో వేసుకుని మా సాధనాలతో రాజమండ్రి చేరుస్తాము" అన్నాడు ఆటవికుడు.

వాళ్ళిద్దరూ అంగీకారాన్ని తెలియపర్చగానే ఆటవికులు ఇద్దరికీ స్పృహ తప్పించారు. స్పృహ వచ్చేసరికి ఇద్దరూ రాజమండ్రీ రైల్వేస్టేషన్లో వున్నారు.

"ఎలా వచ్చేం ఇక్కడికి?" అన్నాడు రామేశం.

"ఎలాగో అలా వచ్చాం! మనమిద్దరం ప్రాణాలతో బయటపడి నాగరకుల మధ్యకు రావడం ఓ పెద్ద విశేషం." అన్నాడు టాగూర్. అతను రామేశాన్ని గట్టిగా కౌగలించుకున్నాడు. రామేశం నెమ్మదిగా కౌగిలి విడిపించుకుని, "ఏమిటిది టాగూర్" అన్నాడు.

"ఆటవిడుపులు నన్ను సోదా చేస్తున్నప్పుడే నా ప్రాణాలు పోయాయనుకున్నాను. నీ మాట విననందుకు ఎంత పశ్చాత్తాపం కలిగిందో చెప్పలేను. చేజేతులా చావుకోరి తెచ్చుకున్నానని నన్ను నేనే నిందించుకున్నాను. నేను చేసిన తప్పు చేయకుండా నీ ప్రాణాలు నువ్వు రక్షించుకో గలిగినందుకు నీమీద నాకు అసూయకూడా కలిగింది..." అన్నాడు టాకూర్.

రామేశం నవ్వి-"ఆ రాళ్ళు తీయకపోవడం మన ప్రాణాలను కాపాడుతుందని నాకు తెలియదు. నాకూ జీవితంలో ఇదొక అపూర్వానుభవం. నీ దృష్టి ఆ రాళ్ళమీద పడిందనీ ఎలాగైనా వాటిల్లో ఒక దాన్నైనా పొందాలను కుంటున్నావనీ నీ ముఖం చూసి నేను గ్రహించాను. వెయ్యి కళ్ళతో నిన్ను కనిపెడుతున్న నేను ఒక మణిని నీ జేబులోకి జార విడవడం గమనించాను. నామీద అనుమానం లేని నువ్వు నేను నీ జేబులోని మణిని తస్కరించి మళ్ళీ యథాస్థానంలో ఉంచేయడాన్ని గమనించలేక పోయావు." అన్నాడు.

"ఏమిటీ?" అన్నాడు టాకూర్. అతడి ముఖంలో ఆనందాశ్చర్యాలు ఒక్కసారిగా చోటు చేసుకున్నాయి.

"అవును. అదే జరిగింది. అప్పట్లో నా మనసుకు తోచిన పని నేను చేశాను కానీ నీ ప్రాణాలు రక్షిస్తున్నానని నాకూ తెలియదు. అయినా ప్రాణాలు పోతాయని తెలిసుంటే నువ్వా ఆ పని చేసుండేవాడివి కాదు కదా!" అన్నాడు రామేశం.

"రామేశం నువ్వు నా ప్రాణదాతవు!" అంటూ ఆయన రెండు చేతులూ పట్టుకున్నాడు టాకూర్. అంతకు మించి ఏమనడానికీ అతడి నోట మాట రాలేదు. అతని కళ్ళలోంచి అశ్రు బిందువులు ధారగా వర్షిస్తున్నాయి.

తను చేసిన ఒకే ఒక్క పొరపాటు తన ప్రాణాలు తీయవలసింది. కానీ ఆ పొరపాటును రామేశం సవరించాడు.

"నేను కాదు నీ ప్రాణదాతను. నీవే. అనుక నీ ప్రాణాదాతనైతే నాకు మనతో బయల్దేరిన మిగతా ముగ్గురి ప్రాణాలనూ కూడా రక్షించాలని వుంది. ఆ పని చేయలేకపోయాను...." అన్నాడు రామేశం. ఆయన కళ్ళలోని బాధను స్పష్టంగా చదవగలిగాడు టాగూర్. జరిగిన భయంకర అనుభవం లాకటొకటిగా గుర్తుకు వస్తుంటే అతను వణికిపోయాడు.

"ఇప్పుడు నాలో పగ, ద్వేషం నశించాయి. జరిగినది జరిగిపోయింది. నీ నుంచి నేను నేర్చుకున్న మానవతా వాదాన్ని గుర్తుంచుకుని నా శేష జీవితాన్ని గడిపేస్తాను" అన్నాడు టాగూర్.

"అది సరికాదు." అన్నాడు రామేశం. "భగవంతుడు మనకు ప్రాణాదానం చేశాడు. అంటే ఆయన మననుంచి ఏదో ఆశిస్తున్నాడు. ఆ అపూర్వ నిధిని ప్రభుత్వానికి అప్పగించడానికీ, ఆ ముఠా దురాగతాల నరికట్టడానికీ, ఆ ఆటవికుల మృత్యులోయను పూడ్చడానికీ మనం నడుం కట్టుకోవాలి."

"అందువల్ల మనం సాధించగలిగినదేముంది? నువ్వన్నట్లు ఈ నాగరక ప్రపంచంలోనే ఎన్నో అనాగరక పద్ధతులున్నాయి. వాటిని మనం ఏమీ చేయలేకపోతున్నాం. ఇలాంటి విషయాల్లో మనం పూర్తిగా నిస్సహాయులం." అన్నాడు టాగూర్.

"అది కాదు టాగూర్. నిధిని వశపరుచుకున్న ముఠా మన అయిదుగురితోనూ ఆడుకున్న పద్ధతి చూశాం గదా! వాళ్ళు మహా దుర్మార్గులు. అలాంటి దుర్మార్గుల చేతికి

అంతటి ధనం లభిస్తే వాళ్ళు మరింత కిరాతకాలకు పాల్పడతారు. మరెందరో ఆ కిరాతకాలకు బలి అవుతారు. ఆ కిరాతకాల నరికట్టడం మన బాధ్యత. ఇందుకు ఏదో ఉపాయం చూడాలి.'' అన్నాడు రామేశం.

"జరిగిన సంఘటనలతో నా మెదడు తుప్పుపట్టి పోయింది. నీవు చెప్పినట్లు చేయడమే నా ఆశయం, కర్తవ్యం. పదిమంది కుపయోగపడే పనులు ఏమి చేయడానికైనా నేను సిద్ధమే-ఆదేశించు...'' అన్నాడు టాకూర్.

"ఈ విషయంలో మనకు పోలీసులు సాయం లభిస్తుందనుకోను. ముందుగా వాళ్ళు మన మాటల్ని నమ్మాలి. నమ్మకపోతే మనం చాలా ఇబ్బందుల్లో పడతాం. టాక్సీవాలా, జోహరీ, జోగారావుల గురించి మనమే సమాధానం ఇచ్చుకోవలసి వస్తుంది. ఆ దుండగులు మనం తప్పించుకున్నట్లు పసిగడితే డబ్బుతో సాక్ష్యాల్ని కొనేసి మనను నేరస్థులుగా కోర్టులో నిలబెట్టగలరు. అందువల్ల మనం వారిని వారి పద్ధతుల్లోనే ఎదుర్కోవాలి. అందుకు మనకు సింహంలాంటి మనిషి కావాలి...'' అన్నాడు రామేశం.

* * *

"ఇదీ జరిగింది. అప్పట్నించీ నేనూ, టాకూర్ కూడా ఆ ప్రయత్నంలోనే వున్నాము...'' అన్నాడు రామేశం తాత, మనవడితో.

"తాతయ్యా!'' అన్నాడు మనవడు. అతని ముఖంలో కోపం, ఉద్రేకం, ఆశ్చర్యం వున్నాయి. "నీకిలాంటి అనుభవం జరిగినట్లు నాకెందుకు చెప్పలేదు? ఏడాదినుంచి నీలో ఏదో దిగులు గూడుకట్టుకుని వున్నదని గమనిస్తూనే వున్నాను కానీ దాని వెనుక వున్న కారణమిది అని నాకు

నువ్వు చెప్పలేదు''

"ఒరేయ్ రామం." అన్నాడు రామేశం, "మీ నాన్న నీకు ముద్దుగా నా పేరుపెట్టాడు. చిన్నప్పట్నించీ అల్లారు ముద్దుగా పెరిగావు కష్టమంటే ఏమిటో తెలియకుండా నిన్ను నేను పెంచాను. చిన్నితనంలోనే నీకు తల్లీతండ్రీ దూరమైతే ఈ చేతుల్తో పెంచి పెద్దవాణ్ని చేశాను. నిన్ను నేను అతి సుకుమారంగా పెంచాను తప్పితే మరో విధంగా తయారు చేయలేదు. జీవితంలో అటువంటి అనుభవం తటస్థ పడుతుందని నాకు ముందుగానే తెలిసి వుంటే_నిన్ను మరోకలా పెంచి వుండేవాడి నేమో!"

రామం ఏమీ మాట్లాడకుండా తాత వంకే చూస్తున్నాడు.

రామేశం నిట్టూర్చి_"గోమాత కడుపున పులిపిల్ల పుట్టదు. భగవంతుడు ముందుగానే కొన్ని నిర్ణయాలు చేస్తాడు. పులిపిల్ల కానంత మాత్రాన ఆవుకు పుట్టిన లేగదూడ జీవికం వ్యర్థం కాదు కదా! ఈ సృష్టిలోని ప్రతి జీవికి ఒక పరమార్థం వుండనే వుంది. మన జీవన విధానం వేరు. మనం దొంగల నెదుర్కోవడానికీ, యుద్ధాలు చేయడానికీ పుట్టలేదు." అన్నాడు.

"ఇందులో పరమార్థమేం లేదు_ఇదంతా నీస్వార్థం_" అన్నాడు రామం_"నీ మనవడు కాకుండా మరో ప్రాణినీ విషయానికి బలిపెట్టాలని నీ ఆలోచన."

"ఏమాత్రమూ కాదు. సింహంలాంటి ఒక మనిషి దొరికితే, తోడుగా నిన్నూ పంపిస్తాను. మీరిద్దరూ కలిసి వెళ్ళి అన్నీ సాధించుకు వస్తారు..." అన్నాడు రామేశం.

తన తాతయ్య మనసులోని ఆలోచన లేమిటో రామానికి అర్థం కాలేదు. తాతయ్య చెప్పిన కథలో ఇంకా కొన్ని ప్రశ్నలుకూడా వుండిపోయాయి.

"మరి టాగూర్ ఏమయ్యాడు తాతయ్యా!" అన్నాడు రామం.

"ఉన్నాడు. కొంత కాలంలో ఇక్కడికి వస్తాడు. తన కొడుకుతో అతనిక్కడికి రావచ్చును. అందు గురించి తన కొడుక్కు అతను చాలా శిక్షణకూడా ఇప్పిస్తున్నాడు..." అన్నాడు రామేశం ఏదో ఆలోచిస్తూ. "అంతవరకూ నువ్వు మాత్రం ఏ విషయంలోనూ తొందర పడకూడదు. ఈ విషయాన్ని నువ్వు రహస్యంగా వుంచాలి.

"అలాగే తాతయ్యా" అన్నాడు రామం. అలాగని పక్కకు చూసిన అతను వులిక్కిపడ్డాడు. తమ ముందుకు నడిచివస్తూన్న మనిషిని అతను చూడడం అందుకు కారణం.

"నా పేరు గురువులు" అన్నాడా మనిషి.

రామేశం, రామం కూడా గురువులు వంక ఆశ్చర్యంగా చూస్తున్నారు. చూడ్డానికి పీనుగులా వున్నాడు గురువులు. మనిషి కళ్ళలో ఎక్కడా అదురు, బెదురూ లేదు. నడకలో హుందా వుంది.

"గురువులు పేరు విన్నాను" అన్నాడు రామేశం.

"అందుకే ఆ పేరు చెప్పాను. ఇప్పుడు నా పేరు చాలామందికి తెలుసు. కాసేపంటే ఆకాశవాణిలో హెచ్చరికలు కూడా రావచ్చు. నేను జైల్నించి పారిపోయి వస్తున్నాను" అన్నాడు గురువులు.

రామం ఉలిక్కిపడ్డాడు. గురువులు గురించి అతడికి ఇప్పుడు గుర్తుకు వచ్చింది. పేపర్లలో వాడి గురించి చాలా వివరాలు చదివాడతను. గురువులు నరరూపరాక్షసుడనీ, అదృష్టంకొద్దీ పోలీసులకు దొరికాడనీ, తప్పించుకోకుండా పటిష్టమైన పోలీసు కాపలా ఏర్పాటు చేయబడిందనీ

అతను వార్తల్లో చదివాడు.

ఆ గురువులు ఇప్పుడు తన కళ్ళముందు నిలబడి వున్నాడు. మనిషిలో ఏ కోశానా భయంలేదు. తను జైలు నుంచి పారిపోయి వచ్చానని నిర్భయంగా చెబుతున్నాడు.

"ఏం కావాలి నీకు?" అన్నాడు రామేశం.

"నువ్వు నీ మనవడికి చెబుతున్న కథంతా విన్నాను" అన్నాడు గురువులు.

"అంతా...అంతా...విన్నావా?" అన్నాడు రామేశం తడబడుతూ.

"అవును. అంతా విన్నాను. నీ కథ నన్నాకర్షించింది. నువ్వు కోరే సింహం ఎప్పుడు దొరుకుతుందో నాకు తెలియదు. నన్ను నేను పొగుడుకోవడం నాకిష్టముండదు. ఆ అపూర్వనిధికోసం నేను నా ప్రాణాలైనా ధార పోయాలనుకుంటున్నాను. నేను గంగాపురానికి బయల్దేరతాను. నీ మనవణ్ణి నాతో పంపుతావా?" అన్నాడు గురువులు.

"నేను కోరే సింహం నీకులాంటి నేరస్థుడు కాదు. దేశభక్తి గలవాడు. పవిత్రతను పాటించేవాడు. స్వార్థం లేనివాడు" అన్నాడు రామేశం.

గురువులు పకపకా నవ్వాడు. "అలాంటి మనిషి ఒక్కడంటే ఒక్కడున్నాడని నువ్వు ఋజువుచేస్తే నీ కళ్ళముందే పొడుచుకు చస్తాన్నేను. నేను నేరస్థుణ్నే కానీ సమాజం నా మీద ఆ ముద్ర వేయడంవల్ల నేను నేరస్థున్నయ్యాను. సమాజం నిండా నాకు పోటీ నేరస్థులు చాలామందున్నారు.

దేశమంటే నాకూ ఇష్టమే! నేనెప్పుడూ దేశద్రోహానికి తలపడలేదు. పవిత్రత అంటావా, చాలామందికంటే ఎక్కువే ఉంది నాకు. ఏడాదిపాటు హత్యలు చేయ

పండా ఉన్నప్పుడే నన్ను ముట్టుకోవాలని ఓ ఆడపిల్ల అంటే దాన్ని తాకనైనా తాకలేదు. స్వార్థం సంగతి చెప్పుకోవాలంటే నేనూ అందరిలాంటివాణ్ణే! పూర్తిగా నేనూ నాకోసం బ్రతకడంలేదు."

రామేశం చిత్రంగా చూసి, "నా ఇంట్లోకి యెలా వచ్చావ్?" అన్నాడు గురువులి నొక ప్రశ్న వేస్తున్నట్లుగా—

"శ్రీకృష్ణపరమాత్మ పంపాడు!" అన్నాడు గురువులు.

"శ్రీకృష్ణపరమాత్మ ఎవరు?" అన్నాడు రామం ఆశ్చర్యంగా.

"నాకు తెలుసులే" అన్నాడు రామేశం— "అయితే శ్రీకృష్ణపరమాత్మ నిన్నిక్కడకు పంపాడన్నమాట. ఆయన ఆదేశంమీదనే నేనిరోజు ఈ సమయంలో నా మనవడికి జరిగిన కథ చెప్పాను. బహుశా నువ్వు వినాలని ఆయన సంకల్పం కాబోలు. ఆయన లీలలు విచిత్రాలు!"

రామం అర్థంకాక తెల్లబోయి గురువులు వంకనూ, రామేశం వంకనూ చూస్తున్నాడు. అంతా గారడీలా ఉందతనికి.

గురువులుకూడా ఆశ్చర్యంగా, "అయితే నావల్ల ఆయన కోరే పని ఇదేనన్నమాట!" అన్నాడు.

"ఈ పనికి ఆయన నిన్నెన్నుకోవడం ఆశ్చర్యంగా ఉంది" అన్నాడు రామేశం.

"శ్రీకృష్ణపరమాత్మ మనిషేనా తాతయ్యా?" అన్నాడు రామం.

"మనిషే కానీ పరమాత్మ అంతటివాడు" అన్నాడు రామేశం.

"ఇప్పుడు నేనేం చేయాలి?" అన్నాడు గురువులు.

"శ్రీకృష్ణపరమాత్మ ఇక్కడకు ఈరోజు మధ్యాహ్నం

వస్తాడు. అంతవరకూ నువ్వు విశ్రమించవచ్చు" అన్నాడు రామేశం.

శ్రీకృష్ణపరమాత్మను చూడాలని రామానికెప్పుడూ కుతూహలంగా వుంది. రామేశం మాత్రం మనవడితో, "బహుశా నీ ప్రయాణానికి సమయం ఆసన్నమయిందనుకుంటాను. చక్కబెట్టుకోవలసిన రాచకార్యాలేమైనా వుంటే మధ్యాహ్నంలోగా చక్కబెట్టుకున్నరా..." అన్నాడు. మనవడి రాచకార్యాలేమిటో ఆయనకూ తెలుసు.

* * *

రామం బియ్యే ప్యాసయ్యాడు. ఊళ్ళో ఓ పుస్తకాల షాపుంది. అది బాగా రన్ అవుతూంది. దాని వ్యవహారాలు చూడ్డానికి మేనేజర్ ఉన్నాడు. ఆ మేనేజరు మంచి నమ్మకస్థుడు.

అందువల్ల రామం కాస్త పైలాపచ్చీసుగా తిరుగుతూంటాడు. చిన్నప్పట్నుంచీ గారంగా పెరగడం వల్ల అతడికి కష్టాలగురించి అట్టే తెలియదు. సినిమాలు యెక్కువగా చూస్తుంటాడు. అవి చూసినప్పుడల్లా తనుకూడా వాటిలోని హీరోల్లా ఏమైనా సాధించాలని అనుకుంటూంటాడు.

రామానికో ప్రియురాలుంది. ఆమె పేరు లలిత. బియ్యే ఫస్టియర్ చదువుతోంది.

వాళ్ళిద్దరూ కలిసి తిరుగుతున్నట్లు రెండు కుటుంబాల వారికీ తెలుసు. రెండు కుటుంబాలకూ దూరపు బంధుత్వముంది. ఈడూ జోడుకూడా బాగానే వుంది. అందువల్ల వీరి పరిచయం పెద్దలకు మరీ అంత కంటగింపుగా లేదు. ఎటొచ్చీ పెళ్ళి మాటలు ఇంకా రాలేదు. (సశేషం)